
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5
జిల్లా వార్తలు
గురువారం 3 ఏప్రిల్ 2025



ఉష్ణోగ్రత
గరిష్ఠం 36.9
కనిష్ఠం 19.9

సమస్యలు పరిష్కరించాలి

యాచారం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ముచ్చర్లలోని 70ఎంఎల్‌డీడబ్ల్యూపీ కార్యాలయంలో మేనేజర్ వంశీకి వినతిపత్రం ఇచ్చారు. ఈనెల 5వరకు సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. బ్రహ్మయ్య, కృష్ణ, చందునాయక్, యాదయ్య, గిరి పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న ఆదర్శప్రాయుడు



పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీఆర్వో

» డీఆర్వో సంగీత

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రజలకు ఆదర్శప్రాయుడు సర్దార్ సర్వాయి పాపన్న అని డీఆర్వో సంగీత అన్నారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పాపన్న 315 వర్ధంతిని కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాపన్న సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి బి.కేశురాం, కలెక్టరేట్ ఏవో సునీల్, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారులు రమేష్, వై.మాధవరెడ్డి, కుల సంఘ నేతలు బోయపల్లి సుధాకర్‌గౌడ్, నర్సింహాగౌడ్, బండి రాజు గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

పొజిషన్‌చూపి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

» సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రామోజీ ఫిలింసిటీ వద్ద గతంలో వైఎస్ హయాంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలకు సంబంధించి పొజిషన్ చూపి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం రాయపోల్ గ్రామంలో జరిగిన పార్టీ మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో నాగన్‌పల్లి, పోల్కంపల్లి, రాయపోల్, ముకునూరు గ్రామాలను చెందిన 577మంది పేదలకు రామోజీ ఫిలింసిటీ వద్ద ప్రభుత్వ భూమిలో 60 గజాల చొప్పున ఇళ్ల పట్టాలిచ్చారని తెలిపారు. ఈ భూముల్లోకి పోకుండా ఫిలింసిటీ యాజమాన్యం అడ్డుగా గేట్లు పెట్టిందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇక్కడ పేదల గోడు పట్టించుకోలేదన్నారు. రేవంత్ సర్కార్ స్పందించి పేదలకు న్యాయం చేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు రవీంద్రాచారి, కావలి నర్సింహులు మాట్లాడుతూ సీపీఐ శాసనపక్ష నేత కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలతో కలిసి త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలవాలని నిర్ణయించినట్లు చెప్పారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల యాదిరెడ్డి, మండల కార్యదర్శి ములుగు నర్సింహ, నాయకులు పోచమోని నీలమ్మ, శివరాల లక్ష్మయ్య, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చరూ?

ధ్వంసమైన శేరిగూడ రోడ్డు
నరకం చూస్తున్న వాహనదారులు
బాగు చేయించాలని వేడుకోలు

7



మూగ రోదన!



పల్లెల్లో పడకేసిన పశువైద్యం

పల్లెల్లో జీవాలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. పశు సంవర్ధక శాఖలో సిబ్బంది కొరతతో పాటు వసతుల లేమితో పశువులకు వైద్య సేవలు సరిగా అందడం లేదు. జిల్లాలో ఈ శాఖకు సంబంధించి 107 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 11 ఏళ్లుగా వీటి భర్తీ గురించి పట్టించుకున్న వారే లేరు. దీంతో మూగ జీవాలకు వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా పోస్టుల భర్తీపై దృష్టి సారించడం లేదు. జిల్లాలో సుమారు 12 వెటర్నరీ సబ్‌సెంటర్లు మరమ్మతుకు నోచుకోవడం లేవు. సిబ్బంది లేక కొన్నిచోట్ల సబ్‌సెంటర్లు మూత పడ్డాయి.

- పశు సంవర్ధక శాఖలో సిబ్బంది కొరత
- జిల్లాలో ఖాళీగా 107 పోస్టులు
- పశువైద్య కేంద్రాల్లో జీవాలకందని చికిత్స
- ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్న పశు పోషకులు
- ఏళ్లతరబడి మరమ్మతుకు నోచని సబ్‌సెంటర్లు



జిల్లాలో పశుసంపద వివరాలు

ఆవులు	1,88,182
గేదెలు	1,22,587
గొర్రెలు	5,78,254
మేకలు	1,88,190
పందులు	6,076
కోళ్లు	1,78,09,207

రంగారెడ్డి అర్బన్/యాచారం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నాలుగు (తాలుక స్థాయి) ప్రాంత పశువైద్య శాలలు, 46 పశువైద్య కేంద్రాలు, 87 గ్రామీణ పశు వైద్య కేంద్రాలున్నాయి. మొత్తం 309 మంది పశువైద్య సిబ్బంది ఉండాల్సి ఉండగా, 202 మంది ఉన్నారు. 107 ఖాళీలు దర్శనమిస్తున్నాయి. జిల్లాలో ప్రధానంగా అటెండర్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో అటెండర్లు రిటైర్డు అవుతున్నారు కానీ.. రిక్రూట్‌మెంట్ చేయడం లేదు. ఉన్న అటెండర్లు కూడా పదోన్నతి కోసం డిపార్టుమెంట్ ఎగ్జామ్ రాసి పారా సిబ్బంది పోస్టుకు కన్వర్టు అవుతున్నారు. ప్రతీ పశు వైద్యశాలలో

మిగతా 8వ పేజీలో...

వెటర్నరీ ఆసుపత్రుల వివరాలు

ప్రాంత పశువైద్యశాలలు (పాత తాలుక స్థాయి)	04
పశువైద్య కేంద్రాలు	46
గ్రామీణ పశు వైద్య కేంద్రాలు(సబ్‌సెంటర్లు)	87
గోపాల మిత్రలు	32
డిపార్ట్‌మెంటల్ ఇనిస్టిట్యూషన్స్	118

పశువులకు రోగాలొస్తే దేవుడే దిక్కు



పశువులకు రోగాలొస్తే దేవుడే దిక్కు. విజయ్‌కుమార్‌రెడ్డి సార్ ఉన్నప్పుడు మా పశువులకు మంచిగా సేవలందించారు. ఏ రాత్రి ఫోన్‌చేసినా వచ్చేవారు. రానప్పుడు వేరే వైద్యుడిని పంపించేవారు. ఇప్పుడు పశువులకు రోగం వస్తే రూ.500 ఖర్చు చేసి ప్రైవేటు వైద్యుడిని పిలిచి చికిత్స చేయించుకుంటున్నాం. తాటిపర్తిలో సబ్ సెంటర్ బాగు చేసి వైద్యులను నియమించాలి. వైద్యులు కేవలం యాచారం, మేడిపల్లి ఆసుపత్రి వైద్యులు తరచూ గ్రామాలకు వచ్చి పశువులకు చికిత్స చేసి ఆదుకోవాలి.

బి.మహేందర్‌రెడ్డి, రైతు, కుర్మిద్ద

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు



మాట్లాడుతున్న డీఈవో సుశీందర్

చౌదరిగూడ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): విధులు నిర్వర్తించడంలో నిర్లక్ష్యం చేయొద్దని డీఈవో సుశీందర్ రావు సూచించారు. విద్యార్థులను ఎలుకలు గాయపరిచిన విషయం తెలుసుకొని బుధవారం కొందుర్గు మండల కేంద్రంలోని కేజీబీవీని ఆయన సందర్శించారు. సంఘటనపై ప్రత్యేకాధికారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవనంలో ఎలుకలు సంచరించకుండా మరమ్మతులు చేయించాలని సూచించారు.



చిలుకూరుకు పోటెత్తిన భక్తులు

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో హైదరాబాద్ తదితర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.



బోయిన్‌గుట్ట తండాలో సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జైపాల్‌యాదవ్, దశరథ్ నాయక్

హరీశ్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

» నేడు బోయిన్‌గుట్ట తండాలో సభ

» భారీ జనసమీకరణ చేస్తున్న జైపాల్ యాదవ్

కడ్తాల్, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు గురువారం కడ్తాల మండలంలో పర్యటించనున్నారు. బోయిన్‌గుట్ట తండాలో జరిగే బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు నిర్వహిస్తున్న సభ విజయవంతాన్ని పార్టీ శ్రేణులంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సభకు 10 వేల మందిని జన సమీకరణ చేస్తున్నట్లు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, కడ్తాల మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం బోయిన్‌గుట్ట తండాలో సభ స్థలాన్ని వారు పరిశీలించారు. గురువారం ఉదయం 10:30 గంటలకు బోయిన్‌గుట్ట తండాకు హరీశ్ రావు చేరుకుంటారని పేర్కొన్నారు. తండాలో మహాత్మాగాంధీ, అంబేద్కర్, సేవాలాల్ మహారాజ్ విగ్రహాల ఆవిష్కరణ అనంతరం నిర్వహించే సభలో హరీశ్ పాల్గొని మాట్లాడతారని తెలిపారు. అలాగే ముద్విన్ గ్రామంలో జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో రూ.10లక్షలతో ఓ నిరుపేద కుటుంబానికి నిర్మించి ఇచ్చిన ఇంటిని హరీశ్ ప్రారంభిస్తారని జైపాల్‌యాదవ్ వెల్లడించారు.

ఫార్మాసిటీ భూముల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

యాచారం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను బుధవారం రెవెన్యూ, పోలీస్ అధికారులు పరిశీలించారు. గురువారం నుంచి సర్వే చేయడానికి భూముల వివరాలను సేకరించారు. సర్వేకు ఆటంకం కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు. సర్వేకు ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు. కోర్టు వివాదాలు, అథార్టీలో ఉన్న భూములను సర్వే చేయబోమని వెల్లడించారు.



పాడైన బోరు మోటార్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

పాడైన బోరుకు మరమ్మతులు చేయిస్తాం

» మున్సిపల్ కమిషనర్ బాలాజీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొత్తూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్ రెండవ వార్డులోని బీసీ కాలనీలో పాడైపోయిన తాగునీటి బోరును త్వరలో బాగుచేయిస్తామని మున్సిపల్ కమిషనర్ బాలాజీ తెలిపారు. ఈనెల 2న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన 'తిమ్మాపూర్‌లో తాగునీటికి కటకట' అనే శీర్షికకు కమిషనర్ స్పందించారు. బుధవారం కాలనీకి వచ్చి బోరు మోటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం బీసీ కాలనీలో మున్సిపాలిటీ ట్యాంక్ ద్వారా పుష్కలంగా నీరు సరఫరా జరుగుతుందన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని త్వరలో పాడైన బోరుకు మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. ఆయన వెంట 2వ వార్డు కౌన్సిలర్ చింతకింది చంద్రకళరాజేందర్‌గౌడ్ ఉన్నారు.

ఆమనగల్లులో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల కేరింతలు





పరీక్షలు ముగిసె.. విద్యార్థులు మురిసె!

సెంటర్ల వద్ద టెన్త్ స్టూడెంట్స్ సందడి

రంగారెడ్డి అర్బన్/ఆమనగల్లు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గత నెల 21న ప్రారంభమైన ఎగ్జామ్స్ బుధవారం ముగియడంతో సెంటర్ల వద్ద విద్యార్థులు సందడి చేశారు. ఏడాదంతా పుస్తకాలతో కుస్తీలు పట్టి పరీక్షలు బాగా రాయడంతో కేరింతలు కొట్టారు. స్నేహితులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించాలని ఆల్‌ది బెస్ట్ చెప్పుకున్నారు. అనంతరం కొందరు బేకరీలు, రెస్టారెంట్లలో కేకులు, బిర్యానీలు, కూల్‌డ్రింక్స్‌తో పార్టీలు చేసుకున్నారు. పాఠశాల స్థాయిలో ఇవే చివరి పరీక్షలు కావడం, ఇంటర్మీడియట్ ఆపై కోర్సుల్లో వేర్వేరు ప్రాంతాలకు వెళ్లాల్సిన నేపథ్యంలో తోటి విద్యార్థులతో సరదాగా గడిపారు. ఓ వైపు పరీక్షలు ముగిశాయన్న సంతోషం.. మరో వైపు స్నేహితులను విడిపోతున్న బాధ వారి హృదయాలను కలిచివేసింది.

చివరి రోజు ఇలా...

చివరి రోజు సోషల్ పరీక్షకు 51,766 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 51,625 మంది హాజరయ్యారు. హాజరు శాతం 99.72 నమోదైంది. ప్రైవేట్ విద్యార్థుల హాజరు శాతం 80.61 నమోదైంది. ఒకేషనల్ కోర్సు వారికి ఏప్రిల్ 3, 4వ తేదీన పరీక్షలు జరగనున్నాయి.



మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థుల వీడ్కోలు

పరిగి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. నెలల పాటు పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం పరిగి మండల పరిషత్ కార్యాల

పంచాయతీ కార్మికుల వేతనాలివ్వాలి

యం వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. జీవో నం.51ని అనుసరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి, పాత కేటగిరీలనే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్మికుల సంఘం అధ్యక్షుడు నర్సింహులు, కార్మికులు రామస్వామి, వెంకటయ్య, యాదయ్య, శ్రీను, సుక్కమ్మ, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖలో ఖాళీలు భర్తీ చేయండి


స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

వికారాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఏడీ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీచేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లానాయకులు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో స్పీకర్‌తో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, కార్యదర్శి పవన్‌కుమార్, వినోద్‌కుమార్ మాట్లాడారు. విద్యాశాఖ కార్యాలయంలో 14పోస్టులుండగా ఆరుగురే పనిచేస్తున్నారన్నారు. 8 ఖాళీలతో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో జాప్యమైతోందని చెప్పారు. అధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తానని స్పీకర్ హామీ ఇచ్చారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న జంగయ్య, లబ్ధిదారులు

మంచాల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): లింగంపల్లి గేటు వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే లబ్ధిదారులను పంపిణీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రావుల జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం లబ్దిదారులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగంపల్లి గేటు వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను సమీప గ్రామాలైన నోముల, లింగంపల్లి, మంచాలకు చెందిన పేదలకు మంజూరు చేశారన్నారు. కానీ ఇప్పటికీ లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించలేదని చెప్పారు. ఇప్పటికైనా లబ్ధిదారులకు ప్లాట్లు చూపకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్‌రావుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమం లో సీపీఎం నాయకులు బుగ్గరాములు, అశోక్ పాల్గొన్నారు.

విశారదన్ నుంచి రక్షణ కల్పించండి


డీసీపీకి ఇచ్చిన వినతిపత్రాన్ని చూపుతున్న సొంటె శ్రీనివాస్

కేశంపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బీఎస్పీ షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు సొంటె శ్రీనివాస్ బుధవారం శంషాబాద్ డీసీపీ బి.రాజేష్‌ను కలిశారు. తనకు ధర్మసమాజ్ పార్టీ అధినేత విశారదన్ మహరాజ్‌తో సైద్ధాంతిక విభేదాలున్నాయని, అతడి నుంచి తనకు చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరారు. గతంలో తాను విశారదన్‌తో కలిసి పనిచేశానని తెలిపారు. ఉద్యమం మాటున విశారదన్ చేసిన ఆర్థిక అవకతవకలపై ప్రశ్నిస్తే, తనపై తప్పుడు కేసులు పెట్టి జైలుపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ప్రస్తుతం బీఎస్పీ షాద్‌నగర్ అసెంబ్లీ అధ్యక్షుడిగా ఉన్నానని తెలిపారు. బీఎస్పీని నిర్వీర్యం చేసేందుకు, తనను ఇబ్బంది పెట్టేందుకు విశారదన్ తన అనుచరులతో బెదిరిస్తున్నాడని చెప్పారు. విశారదన్ నుంచి తనకు ప్రాణహాని ఉందని, కాబట్టి రక్షణ కల్పించాలి డీసీపీని లిఖిత పూర్వకంగా కోరినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా అభయాంజనేయాలయ వార్షికోత్సవం

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధి నర్కూడ అమ్మపల్లి సీతారామచంద్రస్వామి సమీపంలో గల అభయాంజనేయస్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. విగ్రహ ప్రదాత, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బుక్క వేణుగోపాల్ దంపతులు అధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య చతుర్థి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవాలకు మండలంలోని వివిధ గ్రామాల భక్తులు తరలొచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు. పూజా కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుమార్‌యాదవ్, బి.సంజీవ, బి.గోపాల్, మెండె కుమార్, నాగేశ్ గౌడ్, మల్లాలం మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ఆలయ వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

సీఎం ఇంటి ముట్టడికి ఎల్‌హెచ్‌పీఎస్ పిలుపు

మంత్రి వర్గంలో లంబాడాలకు స్థానమివ్వాలని డిమాండ్

సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ అరెస్ట్



రాంబల్‌నాయక్‌కు అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న పోలీసులు

కేశంపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడాలకు స్థానం కల్పించాలని, లేకుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించిన లంబాడా హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్‌ను కేశంపేట మండలం పొడగుట్ట తండాలోని ఆయన నివాసంలో బుధవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే సంఘం మండల ప్రధాన కార్యదర్శి దేవుజానాయక్, రాంబాబునాయక్‌లనూ అరెస్ట్ చేశారు. అనంతరం రాంబల్ మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రశ్నించే గొంతులను నొక్కేందుకే రేవంత్ సర్కార్ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులను అరెస్ట్ చేస్తోందన్నారు. ఇది అప్రజాస్వామ్మికమన్నారు. అరెస్ట్ చేసిన లంబాడాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై నాయకులను విడుదల చేశారు.

డీలర్‌ను మార్చాలని గ్రామస్తుల ఫిర్యాదు

కందుకూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జైత్వారం రేషన్ డీలర్ ఆగడాలు మితిమీరుతున్నాయని, 12కిలోల బియ్యం తీసుకుంటే వారికి కిలో బియ్యం తరుగు వస్తోందని గ్రామస్తులు బుధవారం ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కె.గోపాల్‌లకు ఫిర్యాదు చేశారు. రేషన్ షాపు నంబరు 1537012 డీలర్ ఎస్.విజయ లబ్ధిదారులకు బియ్యాన్ని సరిగ్గా ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తరుగు ఎందుకొచ్చిందని నిలదీస్తే.. 'తీసుకుంటే తీస్కోండి.. లేదంటే పోండి.' అని అంటున్నారని చెప్పారు. గ్రామంలో 390 రేషన్ కార్డులున్నాయని, నెలనెలా రెండు మూడు క్వింటాళ్ల బియ్యం తక్కువిస్తున్నారని, లబ్ధిదారులు కూడా తగ్గించి తీసుకోవాలని డీలర్ బెదిరిస్తున్నారని అధికారులకు మొరపెట్టుకున్నారు. ప్రశ్నించిన తమపై ఎదురుదాడికి దిగిందని వాపోయారు. డీలర్‌పై విచారణ జరిపి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఆర్డీవో స్పందిస్తూ.. తాము విచారణ చేసి ఫిర్యాదులు నిజమని తేలితే డీలర్‌షిప్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింహ, వెంకటేశ్, పాండు, వీరయ్య, డి.యాదగిరి, అంజయ్య, పి.మహేందర్, సి.మధుకర్‌రెడ్డి, జె.దర్శన్, వి.రవి, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించిన సిబ్బందిని విధుల్లోంచి తొలగించాలి



చౌదరిగూడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థినులను ఎలుకలు కరవడానికి కారకులైన వారిని వెంటనే విధుల్లోంచి తొలగించాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. బాలికలు ఉగాది పండుగకు వెళ్లి భక్ష్యాలు తేవడంతోనే ఎలుకలొచ్చాయని సిబ్బంది చెప్పడం సరికాదన్నారు. బయటి నుంచి ఇతర ఆహార పదార్థాలు హాస్టల్‌లోకి తేకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపైనే ఉందన్నారు. ఈ ఘటనపై ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా మాట్లాడడం ఆమె చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. విద్యార్థినుల జీవితాలతో చెలగాటం ఆడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

కేవీపీఎస్ వర్క్‌షాప్‌ను జయప్రదం చేయండి

యాలాల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కేవీపీఎస్ నేడు(గురువారం) నిర్వహించే వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య అన్నారు. బుధవారం లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో వర్క్‌షాప్ కరపత్రాన్ని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. కులవివక్ష, అంటరానితనం నిర్మూలన, ప్రతిఘటన పోరాటాలపై నేడు వర్క్‌షాపు నిర్వహిస్తున్నామన్నారు. తాండూరు పట్టణంలోని ఎంపీటీసీ ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ వర్క్‌షాప్‌నకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు హాజరవుతారి తెలిపారు.

నాందేడ్-రాయచూర్, కాచిగూడ-రాయచూర్ రైళ్ల రద్దు

హైదరాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): యెర్మారస్-రాయచూర్-మరిచెతల్ స్టేషన్ల మధ్య నాన్-ఇంటర్‌లాకింక్ పనుల కారణంగా ఏప్రిల్ 4, 5తేదీల్లో నాందేడ్-రాయచూర్, 5న కాచిగూడ-రాయచూర్‌ల మధ్య తిరిగే రైళ్లను రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 4న నాందేడ్-రాయచూర్(17664), 5న రాయచూర్-నాందేడ్(17663) రైళ్లు, 5న కాచిగూడ-రాయచూర్(77647-77648) రైళ్లను రద్దు చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. నాందేడ్ డివిజన్ ఔరంగాబాద్-జాల్నా స్టేషన్ల మధ్య ట్రాఫిక్ సమస్య కారణంగా ఏప్రిల్ 3, 5, 6, 9, 10, 12, 13, 15, 16, 17, 19, 20, 22, 23, 24, 26, 27, 29 తేదీల్లో ఔరంగాబాద్-గుంటూరు- ఔరంగాబాద్(17254-17253) రైళ్లను ఔరంగాబాద్-చికల్‌తన్ స్టేషన్ల మధ్య పాక్షికంగా రద్దు చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. అలాగే ఇదే నెలలో కొన్ని రోజులపాటు గుంటూరు-ఔరంగాబాద్- గుంటూరు (17254-17253) రైళ్ల ఔరంగాబాద్-జాల్నా ట్రైన్‌లను పాక్షికంగా రద్దుచేసినట్టు ఎస్సీఆర్ అధికారులు తెలిపారు.


మాట్లాడుతున్న రాములుయాదవ్

కురుమ, యాదవులు రాణించాలి

దుద్యాల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కురుమ యాదవులు అన్ని రంగాల్లో రాణించేందుకు పోరాటం చేయాలని యాదవహక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్ పిలుపునిచ్చారు. పోలెపల్లి ఎల్లమ్మ ఆలయంలో బుధవారం ఆయన అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆయనను యాదవ హక్కుల పోరాట సమితి వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటయ్య సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, వెంకటేశ్, శ్రీనివాస్, నర్సిములు, బాలప్ప, అంజి, శేఖర్, సారంగి, చంద్రశేఖర్, మొగులయ్య పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌కు పాల్పడితే చర్యలు


మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గాయత్రి

దౌల్తాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అక్రమ మైనింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ గాయత్రి అన్నారు. శంకర్‌గుట్ట ప్రాంతంలో మైనింగ్ కొనసాగుతోందని పంచాయతీ కార్యదర్శి గోపాల్ ఫిర్యాదుతో ఆమె స్పందించారు. బుధవారం వెళ్లి పరిశీలించారు. 8ఎకరాలు మైనింగ్ తవ్వకానికి అనుమతులున్నాయని, గుట్ట ప్రాంతంలో ఆంజనేయస్వామి ఆలయం ఉందని, ఆలయం సమీపంలోకి రావొద్దని మైనింగ్ నిర్వాహకులకు సూచించారు. ఆమెతో డీటీ చాంద్‌పాషా, పీఎస్ గోపాల్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీలకు సముచిత స్థానం


సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు సముచిత స్థానం కల్పించేందుకే బీసీ రిజర్వేషన్లను తెచ్చిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా తుంకిమెట్లలో ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు ఆమోదం తెలిపితే ప్రతిపక్ష పార్టీలు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. బీసీలకు సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయంగా సముచిత స్థానం కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ జయకృష్ణ, గౌడ సంఘం నాయకులు నర్సిములుగౌడ్, వెంకట్రాములుగౌడ్, బల్ల వెంకటయ్యగౌడ్, శేఖర్‌గౌడ్, భీమయ్యగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, సూర్యప్రకాశ్‌గౌడ్, శ్యామలయ్యగౌడ్, రాంచంద్రారెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయం

బొంరాస్‌పేట/దుద్యాల: ఆదర్శవంతమైన పథకం సన్నబియ్యం పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం హర్షనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం బొంరాస్‌పేట్, బుర్హాన్‌పూర్, తుంకిమెట్ల, వడిచర్ల, మెట్లకుంట గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. దుద్యాలలో సన్న బియ్యం పంపిణీని రాజేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం నెరవేరేస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌బాబు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య, కృష్ణ, శ్రీశైలంగౌడ్, ఖాజామియా పాల్గొన్నారు.

గుంతలు పూడ్చరూ?

- ధ్వంసమైన శేరిగూడ రోడ్డు
- నరకం చూస్తున్న వాహనదారులు
- బాగు చేయించాలని ఎమ్మెల్యేకు వేడుకోలు


గుంతలమయంగా రోడ్డు

శంకర్‌పల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): శేరిగూడ-కొండాకల్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో శేరిగూడ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దపెద్ద గుంతలతో ప్రయాణించేందుకు గ్రామస్తుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. 3కి.మీ ఈ బీటీ(డాంబర్) రోడ్డుపై గుంతలు పడటంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు రాత్రిపూట ఈ రోడ్డుపై వెళ్తే పడిపోవడం ఖాయం. గత ప్రభుత్వంలో గుంతలను పూడ్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం సైతం ఈ రోడ్డు మరమ్మతుల గురించి పట్టించుకోవడం లేదు. 12ఏళ్ల క్రితం తారురోడ్డు వేసి అప్పటి నుంచి ఎలాంటి ప్యాచ్‌వర్క్‌లు, మరమ్మతులు చేయలేదు. భారీ గుంతలతో రోడ్డు వాహనాలు తిరగలేని విధంగా మారింది. రైతులు నిత్యం మార్కెట్‌కు కూరగాయలు, పువ్వులు, ధాన్యం బస్తాలను తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు బాగ లేక ఆటోలు కూడా రావడం లేదు. విద్యార్థులు, గ్రామస్తులకు శంకర్‌పల్లికి వచ్చేందుకు అవస్థలు తప్పడం లేదు. ప్రజల ఇబ్బందులను ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్యే యాదయ్య రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయించి వెంటనే పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.


గుంతలమయంగా మారిన శేరిగూడ రోడ్డు

వెంటనే బాగు చేయించాలి



రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. పెద్దపెద్ద గోతులతో ప్రయాణించేందుకు వీలులేకుండా ఉంది. రోడ్డు బాగుచేయించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఎన్నిసార్లు గోడు వెళ్లబోసుకున్నా ఫలితం లేకుండా పోయింది. రోడ్డు పూర్తగా వేసే వరకు తాత్కాలికంగా గోతులను పూడ్చి వాహనదారుల ఇబ్బందులు తీర్చాలి.

- సత్యనారాయణ, మాజీ సర్పంచ్, శేరిగూడ

రైతులు, ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంది



రోడ్డుపై గుంతలతో రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రైతులు కూరగాయలు, ధాన్యం బస్తాలను మార్కెట్‌కు తరలించాలంటే కష్టంగా మారింది. ఆటోల్లో తరలిస్తే టైర్లు పంక్చర్ అవుతున్నాయి. ఈ రోడ్డుపై వాహనాలు తరచూ ఫెయిల్ అవుతున్నాయి. పదేళ్ల నుంచి పడుతన్న గుంతలు రోజురోజుకూ పెద్దవయ్యాయి. జిల్లా సరిహద్దులో ఉన్న మా గ్రామాన్ని ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే మా సమస్య తీర్చాలి.

- వెంకటేశ్, మాజీ వార్డు మెంబర్

సాగు భూమికి పట్టాలిప్పించండి


స్పీకర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

వికారాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న భూమికి పట్టాలిప్పించాలని పులుమద్ది రైతులు అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరారు. హైదరాబాద్‌లో స్పీకర్‌ను కలిసి సమస్యను వివరించి వినతి పత్రం ఇచ్చారు. రైతులు మాట్లాడుతూ.. తమ సాగు భూములను ఫారెస్ట్ భూమి అంటూ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. తరచూ తాము ఆయా ప్రభుత్వాల అటవీశాఖ మంత్రులకు విన్నవిస్తేనే అధికారుల ఒత్తిడి తగ్గుతోందన్నారు. 1985కు ముందు ఈ భూమి ప్రభుత్వ భూమి అని, 1985 తరువాత ఫారెస్ట్ భూమి అని అధికారులు వేధిస్తున్నారని తెలిపారు. తాము సాగు చేస్తున్న ఈ భూమి 200 ఎకరాలుందని, అంతా బీసీ, ఎస్సీ రైతులే ఉన్నారని చెప్పారు. కొందరికి పట్టాలు ఉన్నాయని చెప్పారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్పీకర్‌ను రైతులు కోరారు. స్పీకర్‌ను కలిసిన వారిలో శ్యామ్, సుదర్శన్, అంజయ్య, లక్ష్మణ్, దానయ్య, బిచ్చయ్య, నర్సింహులు, భుజంగం ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్


బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

వికారాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వికారాబాద్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు నూలి బస్వరాజ్ పటేల్ తెలిపారు. బుధవారం వికారాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నూలి బస్వరాజ్ పటేల్ జనరల్ సెక్రటరీ వెంకట్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బస్వరాజ్ మాట్లాడుతూ వికారాబాద్ కోర్టు కొత్త భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. జూనియర్ న్యాయవాదులకు విజ్ఞానం పెంపొందించేందుకు శిక్షణ తరగతులు నిర్వహణకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గోవర్ధన్ రెడ్డి, కమల్ రెడ్డి, అశోక్, లవకుమార్, మాధవరెడ్డి, నాగేందర్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్, న్యాయవాద సంఘం ఉపాధ్యక్షుడు శంకరయ్య, ఆనంద్, వసుంధర, రాథోడ్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

రామ్మోహన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

పరిగి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా నుంచి సీనియర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.రామకృష్ణ కోరారు. జిల్లా అధ్యక్షుడిగా నాలుగు ఎమ్మెల్యే స్థానాల విజయానికి కృషి చేసిన రామ్మోహన్‌రెడ్డిని అధిష్ఠానం గుర్తించాలని కోరారు. ఎలాంటి పదవులు లేని రోజుల్లోనే పరిగి అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. రెండు పర్యాయాలుగా ఎమ్మెల్యేగా ఎన్నికైన టీఆర్ఆర్‌ను పార్టీ గుర్తించాలని కోరారు. ఆయన పార్టీ కోసం చేసిన సేవలను గుర్తించి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని అధిష్ఠానాన్ని కోరారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



నృత్యం చేస్తున్న కళాశాల విద్యార్థినులు

తాండూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను, సమాజ సేవాతత్పరులను విద్యార్థులు రోల్ మోడల్‌గా తీసుకోవాలని, అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఎక్సెంచర్ ఐటీ సంస్థ మేనేజర్ అండ్ ఇంపాక్ట్ మోటివేషనల్ స్పీకర్ చల్లా శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన శాలివాహన డిగ్రీ కళాశాల ఫైనలియర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ప్రిన్సిపాల్ శరత్‌చంద్ర మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ కల్వ రాధాకృష్ణ, డైరెక్టర్ మాణిక్యం, సుధాకర్, మల్లేశం, లెక్చరర్లు సిద్ధిలింగయ్య, బసంత్ తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించేందుకు కృషి

కందుకూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పించేందుకు తమ వంతు కృషిచేస్తున్నామని కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో లేమూరు ఉన్నత పాఠశాలలో రూ.3.5లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్‌ఫిల్టర్‌ను మాజీ సర్పంచ్ జి.కొండారెడ్డి, ఢిల్లీ గణేష్‌లు ప్రారంభించారు. గ్రామ ప్రత్యేకాధికారులు సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు. వాటర్‌ఫిల్టర్‌ను ఏర్పాటు చేసిన కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ నిర్వాహకులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

తెల్ల రేషన్‌కార్డుంటే ఆదాయ సర్టిఫికెట్ అవసరం లేదు

కందుకూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకానికి తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారు ఆదాయ ధ్రువీకరణపత్రం పెట్టాల్సిన అవసరం లేదని ఎంపీడీవో సరిత తెలిపారు. బుధవారం మండల పరిషత్‌లో ఆమె మాట్లాడారు. యువ వికాసం స్కీంకు ఈ నెల 14వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వాళ్లు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు లేదా ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, పట్టాదారు పాస్‌పుస్తకం, సదరం సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో అవసరమైన వాటిని పెట్టి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

మహేశ్వరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగి రమేష్ అన్నారు. బుధవారం కళాశాల ఆవరణలో నార్కొటిక్స్ బ్యూరో పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. యాంటీ డ్రగ్ కమిటీ కోఆర్డినేటర్ జహీదాబేగం, వైస్‌ప్రిన్సిపాల్ చందన, ఇంతియాజుద్దీన్, గోపాల్, శ్రీహరి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

కడ్తాల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా నిర్మూలనకు అందరూ కృషిచేయాలని కడ్తాల ఎస్సై వరప్రసాద్ కోరారు. మహిళల చైతన్యంతో మానవ అక్రమ రవాణాను అరికట్టొచ్చన్నారు. కడ్తాలలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం మానవ అక్రమ రవాణా నిర్మూలనపై గ్రామ సంఘాల అధ్యక్షులు, వీవోఏలకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలు, పోక్సో యాక్ట్, లైంగిక వేధింపుల నివారణ తదితర చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఏపీఎం రాజేశ్వరి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

కేశంపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. లింగంధనకు చెందిన నెల్లికంటి బాలమ్మ అనారోగ్యానికి గురై చికిత్స పొందింది. పేదరాలైన ఆమెకు ఎమ్మెల్సీ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.45వేల చెక్కును మంజూరు చేయించారు. బుధవారం షాద్‌నగర్‌లోని తన కార్యాలయంలో చెక్కు అందజేశారు. కార్యక్రమంలో పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్, భాస్కర్, కృష్ణ, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

యాచారం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తాగునీరు సరిపోకుంటే బోర్ల నీటిని వాడుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిషత్‌లో ఏర్పాటు చేసిన వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి నేపథ్యంలో ప్రజలకు ఎక్కడా నీటి కొరత లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. సమావేశంలో ఏపీవో లింగయ్య, ఎంపీవో శ్రీలత పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో నిందితుడికి జీవిత ఖైదు

వికారాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 2017లో కోట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ.15వేల జరిమానా విధిస్తూ స్పెషల్ సెషన్స్(ఎస్సీ, ఎస్టీ కోర్టు) జడ్జీ ఎం.భవానీ బుధవారం తీర్పు చెప్పారని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. 2017 మార్చి 30న ఉదయం కోట్‌పల్లిలో కత్వ కింది ప్రాంతంలో మహిళా శవం ఉందని కోట్‌పల్లికి చెందిన దొరటి నర్సయ్య, గ్రామస్తులు గుర్తించారు. అది తన తమ్ముడి భార్య(మరదలు) ఆడవమ్మదిగా గుర్తించారు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు తీవ్రత దృష్ట్యా 302ఐపీసీ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌ల కింద కేసు నమోదు చేశామన్నారు. అప్పటి డీఎస్పీ శిరీషరాఘవేందర్ దర్యాప్తు చేయగా లింగంపల్లి గ్రామానికి చెందిన నిందితుడు ఎర్రగొల్ల మహేశ్ మహిళను హత్య చేసినట్టు తేలగా అతడిని అరెస్ట్ చేశారన్నారు. కోర్టుకు చార్జ్‌షీట్ సమర్పించామన్నారు. సుదీర్ఘ విచారణ తరువాత జడ్జి భవానీ నిందితుడికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారన్నారు. బాధితుల తరఫున పీపీలు ఎస్.ప్రతాప్‌రెడ్డి, జి.భద్రాద్రి, అప్పటి డీఎస్పీ శిరీష రాఘవేందర్, ధారూర్ సీఐ ఉపేందర్, ప్రస్తుత ఐవో ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, కేసు బ్రీఫింగ్ ఆఫీసర్, లైజనింగ్ ఆఫీసర్ శ్రీనివాస్‌గౌడ్, సీడీవో మహేశ్వర్‌రెడ్డి పనిచేశారని, వారందరికీ అభినందనలని ఎస్పీ తెలిపారు.

మార్కెట్ యార్డులో ముహూర్తపు బీట్లు

తాండూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం ముహూర్తపు బీట్లను చేపట్టారు. మార్కెట్‌లో యేటా ఉగాది తర్వాత ముహూర్తపు బీట్లను నిర్వహిస్తారు. బుధవారం విశ్వావసు నామ సంవత్సరంలో మొదటి పనిదినం నాడు 'ది గ్రెన్ అండ్ సీడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో బీట్లను నిర్వహించారు. పసుపు, కందులను కొనుగోలు చేశారు. పసుపు క్వింటాల్‌కు రూ.18,900, కందులు గరిష్ఠంగా రూ.7800, కనిష్ఠంగా రూ.7400 ధర పలికాయి. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.బాల్‌రెడ్డి, గంజ్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రాములుగౌడ్, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, వ్యాపారులు రాంరెడ్డి, రాధాకృష్ణ, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.



మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

మోడీజీ.. బీసీ బిల్లును ఆమోదించండి

షాద్‌నగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బీసీ వ్యక్తి అయిన నరేంద్రమోడీ దేశ ప్రధానమంత్రిగా ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిమాండ్ చేశారు. బీసీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని కోరుతూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ఆందోళనలో ఆయన ప్రసంగించారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కలిస్తూ అసెంబ్లీ ఆమోదించిన బిల్లుకు కేంద్రం కూడా ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి బీసీల పట్ల ఏమాత్రం గౌరవం ఉన్నా బీసీ బిల్లును వెంటనే ఆమోదించాలని కోరారు.

ఫేస్ టు ఫేస్

ప్రభుత్వ భూముల కబ్జాపై కఠిన చర్యలు

- గౌతమ్‌కుమార్, మొయినాబాద్ తహసీల్దార్



మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతం మొయినాబాద్ మండలంలో దాదాపు 7,557 ఎకరాల 15 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. అందులో కొన్ని కోర్టు కేసుల్లో నడుస్తున్నాయి. మరికొన్ని కబ్జాలకు గురవుతున్నాయి. ఈమేరకు నాలాలు, కాలువలను గుర్తించి కబ్జాదారుల్లో నుంచి రక్షిస్తామని, త్వరలో హైడ్రా అధికారుల బృందం మండలంలోకి వస్తుందని మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ హెచ్చరిస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు చెప్పారు.

ప్రశ్న: నగర శివారు ప్రాంతం కావడంతో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురయ్యే అవకాశం ఉంది. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : త్వరలోనే మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తాం. ప్రభుత్వ భూమి అని బోర్డులు పెట్టిస్తాం. ఇటీవల కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైతే స్వాధీనం చేసుకున్నాం.

ప్రశ్న: మీ ఆఫీసులో సిబ్బంది సమయపాలన పాటించడంలేదనే విమర్శలున్నాయి.. నిజమేనా?

జవాబు : ఇటీవల ఇంటర్ పరీక్షలతో పాటు టెన్త్ తరగతి ఎగ్జామ్స్ పూర్తయ్యాయి. మా సిబ్బంది విధులు నిర్వహించారు. నేటి నుంచి అందుబాటులో ఉంటారు.

ప్రశ్న: నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ఎప్పుడు ఏర్పాటు చేస్తారు?

జవాబు : ప్రస్తుతం ఉన్న భవనం దాదాపు 40 ఏళ్ల క్రితం నిర్మించారు. అందులోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నాం. నూతన భవన నిర్మాణం కొరకు ప్రతిపాదనలు పంపించాం.

ప్రశ్న: మండలంలో కొత్త రేషన్‌కార్డులు ఎన్ని మంజూరయ్యాయి?

జవాబు : మండలంలో ఇటీవల దాదాపు 1162 కార్డులు మంజూరయ్యాయి. లబ్ధిదారులు సన్న బియ్యం కూడా పొందుతున్నారు. మండల పరిధిలో మొత్తం 16,370 కార్డులున్నాయి.

ప్రశ్న: రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు : ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో పక్కదారి పట్టే అవకాశం లేదు. ఒకవేళ అలా జరిగితే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మండలంలోని మీసేవ కేంద్రం ఒక్కటే ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు? మరో సెంటర్ ఏర్పాటు చేస్తారా?

జవాబు : ప్రజల ఇబ్బందులు మా దృష్టికి వచ్చాయి. ఇటీవల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే మండలానికి రెండు మీ సేవ కేంద్రాలు వచ్చే అవకాశం ఉంది.

మూగ రోదన!

(5వ పేజీ తరువాయి)

అటెండర్ పోస్టు ఖాళీగా దర్శనమిస్తుంది. జిల్లాలోని అధిక శాతం పశువైద్య కేంద్రాల్లో డాక్టర్లు ఉంటే సిబ్బంది ఉండటం లేదు.. సిబ్బంది ఉంటే డాక్టర్లు ఉండటం లేదు. ఈ రెండు ఉన్న చోట అవసరమైన మందులు అందుబాటులో ఉండటం లేదు. దీంతో సకాలంలో పశువైద్యం అందక పశువులు మృత్యువాత పడుతున్నాయి.

రోగాల బారిన జీవాలు

రైతులకు పాడి, పంట రెండు కళ్లలాంటివి. వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉండే పశువులను కంటికి రెప్పలా కాపాడుకుంటారు. పాడి పశువులకు సీజనల్ వ్యాధులు సోకితే చూసే దిక్కులేదు. వేల రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన పశువులకు సరైన వైద్యం అందక మృత్యువాత పడుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎక్కువగా వర్షాకాలంలో పశువులు, గొర్రెలు, మేకలు, వ్యాధుల బారిన పడుతున్నాయి. పశువులకు జబ్బు చేసినప్పుడు పశు వైద్య కేంద్రాలకు వెళ్తే అక్కడ సిబ్బంది ఉండకపోవడంతో సకాలంలో వైద్యం అందటం లేదు. అంతేకాకుండా అనేక కేంద్రాల్లో మందుల కొరత, ఆధునిక పరికరాలు అందుబాటులో ఉండకపోవడంతో పశు పోషకులు ప్రైవేట్‌బాట పడుతున్నారు. ఈ పరిస్థితి షాద్‌నగర్ నియోజకవర్గంలోని కేశంపేట, చౌదరిగూడ, కొందుర్గు, యాచారం, చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్ మండలాల్లో ఎక్కువగా ఉంది.

మూతబడిన పశు వైద్య కేంద్రాలు

సిబ్బంది కొరతతో పశు వైద్య కేంద్రాలు ఒక్కొక్కటిగా మూత పడుతున్నాయి. చేవెళ్ల మండలంలోని కౌకుంట్ల, కమ్మెట, ఖానాపూర్, చెన్‌వెల్లి, గుండాల, ముడిమ్యాల గ్రామాల్లో పశువైద్య కేంద్రాలు మూత పడ్డాయి. ఏడు సంవత్సరాలుగా ఈ పశువైద్యకేంద్రాల్లో లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు, వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారుల పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. చేవెళ్ల మండలంలో ఆరు అటెండర్ పోస్టులు భర్తీకి నోచుకోవడంలేదు. ప్రస్తుతం కొన్నిచోట్ల ఔట్‌సోర్సింగ్ విధానంలో అటెండర్లను నియమించుకొని పనికానిచ్చేస్తున్నారు.

డివిజన్ ఎత్తేశారు..!

చేవెళ్ల మండల కేంద్రంలో పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాలయం ఉండేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొన్నాళ్లకే డివిజన్స్ ఎత్తేయడంతో చేవెళ్లలోని ఏడీ కార్యాలయాన్ని వికారాబాద్‌కు తరలించారు. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలన్నీ నిరుపయోగంగా మారాయి. దీంతో ఎస్డీవో కార్యాలయానికి పక్కా భవనం లేకపోవడంతో పశువైద్య భవనంలోకి షిష్టు చేశారు. చేవెళ్ల పార్లమెంట్ హెడ్‌క్వార్టర్‌లో ఉండాల్సిన ఏడీ కార్యాలయం ఇతర ప్రాంతానికి తరలించినా.. పాలకులు చూస్తున్నారే తప్ప పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి పట్టించుకొని తిరిగి ఏడీ ఆఫీసు చేవెళ్లకు వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



యాచారం మండలం తాటిపర్తిలో మరమ్మతుకు నోచుకోని పశు సంవర్ధకశాఖ సబ్‌సెంటర్ భవనం

కొత్త భవనాలు, మరమ్మతులు

జిల్లాలోని దోస్వాడ, సరూర్‌నగర్, మాదాపూర్, హైదర్‌గూడ, చౌదరిగూడలో కొత్త పశువైద్యశాల భవనాలు నిర్మించాల్సి ఉందని అధికారులు తెలిపారు. అంతేకాకుండా నందిగామ, మహరాజ్‌పేట్, మొగిలిగిద్ద గ్రామాలలో ఉన్న పశువైద్యశాలలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. చిన్న తూండ్ల, తాటిపర్తి, వెంకటాపూర్, చిల్‌కూర్, అజీజ్‌నగర్, కేతిరెడ్డిపల్లి, రాయపోల్, ముద్విన్, మీర్‌ఖాన్‌పేట్, తాళ్లపల్లి, చౌదర్‌పల్లి, కొండాపూర్‌లలో ఉన్న సబ్‌సెంటర్లకు కూడా రిపేర్ చేయాల్సి ఉంది. ఇవి కాకుండా నాదర్‌గుల్, పెద్దమంగళారం, వెల్‌జాల్, పడకల్, నిర్దవెల్లి, నేదునూర్, పులిమామిడి, పెద్దఅంబర్‌పేటలలో కొత్తగా సబ్ సెంటర్లు నిర్మించాల్సి ఉంది. ఇవి నిర్మిస్తే మారుమూల గ్రామాలలోని పశువులకు మెరుగైన సేవలందనున్నాయి.

మెరుగైన సేవలందిస్తున్నాం



జిల్లాలో పాల ఉత్పత్తి పెంచడానికి ఆవులకు, గేదెలకు సెక్స్‌స్టార్టెడ్ సిమెన్‌ను రూ.250 తీసుకొని ఇస్తున్నాం. ఆడపశువులను పెంచడం కోసం ప్రభుత్వం దీనిని ఇస్తుంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. పశువులకు రోగమొస్తే తమ సిబ్బందికి తెలిపి చికిత్స చేయించుకోవాలి. సబ్‌సెంటర్ల మరమ్మతులు, కొత్త భవనాల నిర్మాణం చేపట్టడంపై ప్రభుత్వానికి నివేదించాం.

డా.విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా పశువైద్యాధికారి

పశువైద్య సిబ్బంది వివరాలు

సిబ్బంది	మొత్తం	పని చేస్తున్నవారు	ఖాళీలు
జిల్లా పశువైద్య, పశు సంవర్ధకశాఖ అధికారి	01	01	0
సహాయ సంచాలకులు	06	06	0
పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులు	48	45	03
వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్	16	14	02
జూనియర్ వెటర్నరీ ఆఫీసర్	31	31	0
లైవ్‌స్టాక్ అసిస్టెంట్	53	16	37
వెటర్నరీ అసిస్టెంట్	37	34	03
ఆఫీస్ సబార్డినేటర్స్	117	55	62
మొత్తం	309	202	107

క్రైం కార్నర్

బొలెరో ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

శంకర్‌పల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బొలెరో వాహనం ఢీకొనడంతో ఓ వృద్ధురాలు మృతిచెందింది. సీఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం మేరకు.. శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని గణేష్‌నగర్‌కు చెందిన వడ్డె లక్ష్మమ్మ(70) మంగళవారం సాయంత్రం శంకర్‌పల్లిలోని చేపల మార్కెట్ వద్ద రోడ్డు దాటుతుండగా అటుగా వచ్చిన బొలెరో వాహనం లక్ష్మమ్మను ఢీకొంది. తీవ్రగాయాలు కావడంతో కుటుంబికులు, స్థానికులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందిందని వైద్యులు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో జీపీ కార్మికుడు మృతి



కృష్ణ(ఫైల్)

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని పాలమాకుల గ్రామ పంచాయతీ కార్మికుడు కృష్ణ బుధవారం మృతి చెందాడు. కాగా, అతడు గత 20 ఏళ్లుగా పంచాయతీలో విధులు నిర్వహిస్తున్నాడు. అయితే, అతడు అనారోగ్యంలో మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమేరకు అతడి కుటుంబానికి రూ.2లక్షల ఇన్సూరెన్స్ అందించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ గౌరవాధ్యక్షుడు జగ్గల శామ్యూల్, సిబ్బందితో కలిసి ధర్నా నిర్వహించారు. అక్కడికి చేరుకున్న తహసీల్దార్ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం



అనూష



కుషేర్ పాశ్వాన్

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమైనట్లు సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శంషాబాద్ మండలంలోని చౌదరిగూడకు చెందిన మల్‌చాలమ్ మంజుల మంగళవారం మధ్యాహ్నం శంషాబాద్‌లోని కూరగాయల మార్కెట్‌కు వెళ్లింది. ఆ సమయంలో భర్త సిద్దులు, కూతురు అనూష ఇంట్లో ఉన్నారు. అయితే, సాయంత్రం బయటకు వెళ్లిన సిద్దులుకు భార్య మంజుల ఫోన్ చేసి అనూష కనిపించడం లేదని చెప్పింది. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా, 6 నెలల క్రితం అనూష నవీన్ అనే వ్యక్తితో తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండటంతో ఆమెను మందలించారు. ఇకపై నవీన్‌తో మాట్లాడనని చెప్పిందని, అతడిపై అనుమానం ఉందని మంజుల ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా వ్యక్తి అదృశ్యమైన ఘటన శంషాబాద్ మండలంలో జరిగింది. బీహార్‌కు చెందిన కుషేర్ పాశ్వాన్ శంషాబాద్ మండలంలోని మదన్‌పల్లికి నెల రోజుల కుటుంబ సభ్యులతో వచ్చాడు. గ్రామంలోని స్టార్ ప్లాస్టిక్ ఎంటర్‌ప్రైజెస్‌లో కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మూడు రోజుల నుంచి కుషేర్, భార్య చందుదేవి మధ్య గొడవ జరిగింది. మంగళవారం సాయంత్రం బాత్‌రూమ్‌కు వెళ్లి వస్తానని చెప్పిన కుషేర్ బయటకు వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో బుధవారం భార్య చందుదేవి శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అలాగే ఓ మహిళ అదృశ్యమైన ఘటన శంషాబాద్ మండలంలో జరిగింది. పాలమాకులకు చెందిన వరికుప్పల మాధవికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. చిన్న కూతురు మాధవి టైలరింగ్ కోసం గత నెల రోజుల నుంచి జగద్గిర్ గుట్టకు వెళ్తోంది. బుధవారం ఆరోగ్యం బాగోలేదని ఇంట్లోనే ఉంది. జిరాక్స్ కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో తండ్రి జంగయ్య ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ రైల్వేస్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు. సుమారు 30 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తిని మంగళవారం రాత్రి బూర్గుల రైల్వేస్టేషన్ సమీపంలో కాచిగూడ వెళ్లే డెమూ రైలు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు 98490-90425కు సమాచారం ఇవ్వాలని హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ కోరారు.

15 తులాల బంగారం అపహరణ

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టపగలు ఇంట్లోకి చొరబడి 15 తులాల బంగారం అపహరించుకుపోయిన ఘటన షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోలీపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. సోలీపూర్‌కు చెందిన పులిమామిడి కృష్ణయ్య ఉదయం 11 గంటలకు మీ సేవ కేంద్రంలో పని ఉండటంతో ఇంటికి తాళం వేసి వరండాలో ఉన్న చెప్పుల స్టాండ్‌లో తాళం చెవి పెట్టి వెళ్లాడు. అప్పటికే ఆయన భార్య పనిమీద పాఠశాలకు వెళ్లింది. అదే సమయంలో గుర్తుతెలియని దుండగుడు చెప్పుల స్టాండులో పెట్టిన తాళం చెవి తీసుకొని తాళం తీసి లోపలికి వెళ్లాడు. పడక గదిలోని బ్యాగులో ఉన్న 15 తులాల బంగారం దొంగిలించాడు. కాగా, దొంగ ఇంట్లో ఉన్న సమయంలోనే కృష్ణయ్య భార్య ఇంటికి వచ్చింది. చప్పుడు వస్తుండటంతో భర్త ఇంట్లోనే ఉన్నాడనుకొని.. ఏం చేస్తున్నారని అడిగింది. అదే సమయంలో దొంగ ఫోన్ మాట్లాడుతున్నట్లు గది నుంచి బయటికి వచ్చాడు. వేరే వ్యక్తితో ఏదో పని చేయిస్తున్నాడని బాత్‌రూంలో కాళ్లు కడుక్కునేందుకు వెళ్లింది. తిరిగి వచ్చేలోపు దొంగ పరారయ్యాడు. పడక గదిలోకి వెళ్లి చూడగా కబోర్డులు తెరిచి ఉన్నాయి. బంగారం ఉన్న బ్యాగు కనిపించలేదు. ఇంటికి వచ్చిన భర్తకు విషయం చెప్పగా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సర్వాయి పాపన్నకు ఘన నివాళి

షాద్‌నగర్ అర్బన్/ఆమనగల్లు/చేవెళ్ల/తలకొండపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం పాలకులను ఎదురించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని సందర్భంగా షాద్‌నగర్ గౌడ యువజన సంఘాల నాయకులు నివాళులర్పించారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ ఆవరణ ఎదురుగా ఉన్న పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. గౌడ సంఘాల నాయకులు ఎడ్ల శ్రీకాంత్‌గౌడ్, కె. ప్రేమ్‌కుమార్ గౌడ్, వీర్లగూడెం అభిలాష్‌గౌడ్, పోలేపల్లి సందీప్ గౌడ్, ఎం. కార్తీక్‌గౌడ్, పి. ప్రవీణ్‌గౌడ్, ఏ. రఘు గౌడ్, వంశీగౌడ్, శివశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పాపన్న పోరాట పటిమ, సేవానిరతి అందరికి ఆదర్శనీయమని గౌడ సంఘం



షాద్‌నగర్ అర్బన్ : పాపన్న విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న గౌడ, యువజన సంఘాల నాయకులు



ఆమనగల్లు : పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న అల్లాజీ గౌడ్, రవిగౌడ్, నాయకులు

ఆమనగల్లు తాలుకా అధ్యక్షుడు చుక్క అల్లాజీగౌడ్, ఉపాధ్యక్షుడు గంగ రవీందర్‌గౌడ్‌లు అన్నారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ వర్ధంతిని నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో కాటమయ్య దేవాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో గౌడ సంఘ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌడ సంఘం మండలాధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, పట్టణ్యాక్షుడు గజ్జె వెంకటయ్యగౌడ్, యువజన సంఘం అధ్యక్షుడు గుండ్రాతి నరేశ్ గౌడ్, ప్రదానకార్యదర్శి గజ్జె రాఘవేందర్ గౌడ్, నాయకులు అల్లాజీ, నర్సింహ్మ, శివ, వెంకటేశ్, మనోజ్, పల్లె సాయి గౌడ్, అంజి, తదితరులు పాల్గొన్నారు. మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలతో నివాళుల ర్పించారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండుయాదవ్, సీనియర్ నాయకులు కర్ణం ప్రకాశ్‌గౌడ్, చేవెళ్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ జనార్దన్, బాలయ్య, సాయికిరణ్‌గౌడ్, సాయి, వంశీగౌడ్, అంజన్‌గౌడ్, నర్సింహులుగౌడ్ పాల్గొన్నారు. అలాగే పాపన్న గౌడ్ వర్ధంతిని వేడుకలు తలకొండపల్లి మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మండలాధ్యక్షుడు కుమార్‌గౌడ్, తాలుక ఉపాధ్యక్షుడు తిరుమణి శ్రీశైలం గౌడ్, నాయకులు రవిగౌడ్, అశోక్‌గౌడ్, విష్ణుగౌడ్, గణేశ్, శ్రీనివాస్, సురేశ్, శ్రీశైలం, ప్రదీప్, పద్మ అనిల్, జంగయ్య, కృష్ణ, నరేందర్‌గౌడ్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా బుగ్గ రామేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

షాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో వెలిసిన శ్రీబుగ్గరామేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా బుధవారం అగ్నిగుండం, స్వామివారి పల్లకీ సేవా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి అలయ ప్రాంగణంలో అగ్నిగుండం ఏర్పాటు చేయగా భక్తులు అందులోంచి నడిచారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో పాటు మండల ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి



రైతుకు చెక్కును అందజేస్తున్న శేఖర్‌రెడ్డి

షాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి అన్నారు. మేకల సరస్వతి పీఏసీఎస్ బ్యాంకులో ఎల్‌టీ లోన్ తీసుకుంది. 10-2-2025 రోజుల తన గేదె ప్రమాదవశాత్తు చనిపోయింది. దీంతో ఇన్సూరెన్స్ కింద బుధవారం రూ.95వేల చెక్కు మంజూరు కాగా అందజేశారు. సీఈవో శివకుమార్, రాంచందర్ ఉన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

మహేశ్వరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సుభాన్‌పూర్‌లో పలు రకాల సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని మాజీ సర్పంచ్ పద్మపాండు అన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ (స్వయం ప్రతిపత్తి) కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గ్రామంలో చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు బుధవారంతో ఏడోరోజుకు చేరాయి. కళాశాల విద్యార్థులు గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రత, ఓటు ప్రాధాన్యత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి ర్యాలీలు నిర్వహించారు. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జి నర్సింహులు, డాక్టర్ ఎం.మధుకర్‌రావు, రాఘవేందర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

భజ్‌రంగ్‌దళ్ మండల కమిటీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న రమేష్

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వ్యక్తి నిర్మాణం.. సమాజ హితం కోసం పనిచేయాలని విశ్వహిందూ పరిషత్, భజ్‌రంగ్‌దళ్ పాలమూరు విభాగ్ సంయోజక్ గూడెం రమేష్ అన్నారు. మొయినాబాద్ మండల భజ్‌రంగ్‌దళ్ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. రమేష్ మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ సనాతన ధర్మ పరిరక్షణ కోసం పనిచేయాలని సూచించారు. భజ్‌రంగ్‌దళ్ మండల సంయోజక్(అధ్యక్షుడి)గా విజయ్‌పాండు, సహా సంయోజక్‌గా శ్రీధర్‌ను ఎన్నుకున్నారు. రమేష్‌చారి, కాసుల సురేష్‌గౌడ్ భజ్‌రంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

దశరథ్ నాయక్ ఉదారత.. యాదమ్మ సొంతింటి కల సాకారం

కడ్తాల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ముద్విన్ గ్రామానికి చెందిన షేడ యాదమ్మ భర్త లక్ష్మయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి ఇద్దరు పిల్లలు, అత్తతో కుటుంబ పోషణ ఇబ్బందిగా నెట్టుకొస్తోంది. కనీసం సొంతిళ్లు కూడా లేక ఏళ్లకాలంగా పూరి గుడిసెలో జీవనం సాగిస్తోంది. యాదమ్మ కుటుంబ దీనస్థితి గురించి ముద్విన్ మాజీ సర్పంచ్ యాదయ్య, ఉపసర్పంచ్ వినోద్, పలువురు స్థానిక నాయకులు లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ దృష్టికి తెచ్చారు. జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఏడాదిలో సుమారు రూ.10 లక్షల వ్యయంతో రెండు గదులు, ఓ వంట గదితో పూర్తిస్థాయి ఇంటి నిర్మాణం చేయించారు. డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మండల కేంద్రానికి బాచిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి చెరో రూ.లక్ష ఇంటి నిర్మాణానికి సామయందించారు. నేడు(గురువారం) మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతిరాథోడ్, రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్‌రెడ్డి, వాణిదేవిలు గృహప్రవేశం చేసేందుకు వస్తున్నట్లు దశరథ్ తెలిపారు.

నేటి నుంచి ఉచిత కంటి చికిత్సలు

తలకొండపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవునిపడకల్ మాధవన్‌జీ అవేర్‌రూరల్ ఆసుపత్రిలో ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకరన్ నేత్రాలయం సహకారంతో లట్టుపల్లి కృష్ణదేవ్ రెడ్డి, డాక్టర్ మేకల విజయల ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

షాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి అన్నారు. చందన్‌వెళ్లికి చెందిన ఆకుల మనోహర్ జన్మదినం సందర్భంగా గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నిరుపేదలకు అందజేస్తున్న సన్నబియ్యంను లబ్దిదారులకు పంపిణీ చేశారు. గ్రామస్తులు నర్సింహారావు, రామస్వామిగౌడ్, కిష్టయ్య, తదితరులున్నారు.

సీసీఐ సహాయ కార్యదర్శిగా వెంకన్నబాబు

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 02 (ఆంధ్రజ్యోతి): కన్స్యూమర్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియా సొసైటీ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా షాద్‌నగర్‌కు చెందిన కొమ్ము వెంకన్నబాబును నియమించారు. హైదరాబాద్‌లోని రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో మంగళవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో వెంకన్నబాబును రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమిస్తూ, రిటైర్డ్ జడ్జి మల్యాద్రి సన్మానించారు. అదేవిధంగా వెంకన్నబాబును సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు భీంరెడ్డి, వినియోగదారుల సంఘం నాయకుడు గోపాల్‌నారాయణ్‌లు ఈ సందర్భంగా అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత

మాడ్గుల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నాగిళ్లకు చెందిన పల్లేటి భాగ్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అనుచరులు బీఆర్ఎస్ నాయకులు పులికంటి మహేష్ ద్వారా బాధిత కుటుంబ సభ్యుడు పల్లేటి కుమార్‌తో రూ.10 వేలు కూర్చి అందచేశారు. చంద్రయ్య, శివ, జంగయ్య తదితరులున్నారు.

సన్నబియ్యం.. నిరుపేదలకు వరం

కొత్తూర్/మొయినాబాద్ రూరల్ /చేవెళ్ల/షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సన్నబియ్యం పథ కం నిరుపేదలకు వరం లాంటిందని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్, మండల శాఖల అధ్యక్షులు జె. సుదర్శన్‌గౌడ్, గొంగళ్ల హరినాథ్‌రెడ్డిలు అన్నారు. మున్సిపాలిటీలోని తిమ్మాపూర్, కుమ్మరిగూడ, మండలంలోని తీగాపూర్, కొడిచర్లలోని చౌకధర దుకాణాల్లో బుధవారం బియ్యంను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు కట్రోళ్ల సురేందర్ తదితరులు పాల్గొన్నారు. సన్న బియ్యం నిరుపేదల ఆత్మగౌరవ పథకం అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలకృష్ణారెడ్డి అన్నారు. మొయినాబాద్ మండలంలోని కనకమామిడిలో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రవిందర్‌రెడ్డి మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు ఆలూరి రాములు, డీలర్ అనంతరెడ్డి రేషన్‌కార్డు లబ్దిదారులు పాల్గొన్నారు. పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు యాదవ్ తెలిపారు. తంగడ్‌పల్లిలోని రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. సత్తయ్యగౌడ్, ఎండీ సల్మాన్‌ఖాన్, అక్రమ్, పాషా, ఆసిఫ్, తదితరులున్నారు. సన్న బియ్యం పంపిణీ పథకం చరిత్రలో నిలిచి పోతుందని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి జంగయ్య తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్లలో బియ్యం పంపిణీ చేశారు. నాయకులు, రేషన్ డీలర్ కల్పన, తిరుపతియాదవ్, రవి, యాదయ్యలున్నారు.

హెచ్‌సీయూ భూములను కాపాడాలి



ఇబ్రహీంపట్నం : నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం/చౌదరిగూడ/కడ్తాల్/యాచారం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైందని హెచ్‌సీయూలో భూములను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు సామ్యేల్ డిమాండ్ చేశారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో నాయకులతో కలిపి నిరసన తెలిపారు. హెచ్‌సీయూలోని 400 ఎకరాల ప్రభుత్వ భూములను కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వం కట్టబెట్టాలనే ఆలోచనలో ఉందని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే అందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జగన్, జంగయ్య, వెంకటేష్ తదితరులున్నారు. యూనివర్సిటీ భూములను కాపాడాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ ఇంటి ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వడంతో జిల్లేడ్ చౌదరిగూడ, కొందుర్గు పోలీసులు నాయకులను ముందస్తు అరెస్టులు చేసి స్టేషన్‌కు తరలించారు. రామ్‌చరణ్ నాయక్, రవీందర్ నాయక్, చందు, తదితరులున్నారు. భూముల వేలం నిలిపివేయాలని కోరుతూ కడ్తాల మండల కేంద్రంలో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి కాంటేకార్ భగీరథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రమిచ్చారు. భగీరథ్, మహేశ్, తదితరులున్నారు. యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ, సీపీఎం కార్యకర్తలను నాయకులను పోలీసులు అక్రమంగా నిర్బంధించడం దారుణమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. సెంట్రల్ యూనివర్సిటీలో సీపీఎం నాయకుల అక్రమ అరెస్టుకు నిరసనగా బుధవారం సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఎర్రజెండాలుపూని ఆందోళనకు దిగారు. రెండు గంటల పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పి.బ్రహ్మయ్య, పి.అంజయ్య, ఆంజనేయులు, తదితరులున్నారు.

సాదాసీదాగా తైబజార్ వేలం

చౌదరిగూడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ తైబజారు వేలాన్ని అధికారులు సాదాసీదాగా నిర్వహించారు. జిల్లేడ్ గ్రామానికి చెందిన ప్రకాష్, చౌదరిగూడకు చెందిన ఏజాజ్ అలీ, గాలిగూడకు చెందిన చంద్రశేఖర్‌లు పోటీ పడగా ఏజాజ్ రూ.5లక్షల పదిహేను వందలకు తైబజార్ దక్కించుకున్నాడు. తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీవో హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచి పనులకు చిరస్థాయి కీర్తి

తలకొండపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సేవలను బట్టే కీర్తి లభిస్తుందని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. జీవిత కాలంలో చేసిన మంచి పనులు మరణానంతరం కూడా కీర్తించబడుతాయన్నారు. ఖానాపూర్ మాజీ ఎంపీటీసీ గార్లపాటి సరిత సంతాప కార్యక్రమం బుధవారం గ్రామంలో నిర్వహించారు. గార్లపాటి గణేశ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, సంఘాలనేతలు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, డోకూరు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు హాజరై సరిత చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

ఢిల్లీకి తరలిన కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు/కందుకూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను పార్లమెంట్ ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడికి బుదవారం ఢిల్లీలో నిర్వహించిన బీసీల పోరు గర్జనకు ఆమనగల్లు మండలం నుంచి పలువురు కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. ఎంపీ మల్లు రవితో కలిసి కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు మండ్లీ రాములు, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గుర్రం కేశవులు ఢిల్లీకి వెళ్లి పోరు గర్జనలో పాల్గొన్నారు. బలహీన వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఆ సంఘం నేతలు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కందుకూరు మండలం నుంచి ఢిల్లీకి పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఢిల్లీలో తలపెట్టిన బీసీల పోరు గర్జన మహాధర్నాలో మండలానికి చెందిన ఇంద్రకంటి రవీందర్‌గౌడ్, నరహరి, భిక్షపతి, సాటు మైసయ్య, శ్రీశైలం, సాయి, సిద్దు, మహేందర్, బుచ్చయ్య, శివరాజు, ధనరాజుగౌడ్, సతీష్, తదితరులు తరలి వెళ్లారు.